సెకండ్ సాటర్‌డే; ఆఫీసుకు సెలవు కావడంతో ఏమీతోచక తన పెళ్ళి ఫోటోల ఆల్బమ్ చూస్తూ కూర్చున్నాడు రవికృష్ణ.

వంటింట్లో అతని శ్రీమతి శిరీష చేస్తున్న వంట తాలూకు గిన్నెల సంగీతం వింటూ, ఒకో ఫోటోని నిశితంగా పరిశీలిస్తూ, పేజీలను తిరగేస్తున్నాడతను. ఆ ఫోటోలను చూస్తుంటే అతడికి చాలా థ్రిల్‌గా ఉంది. అతడి ఫ్రెండ్ కిషోర్ మంచి ఫోటోగ్రాఫర్. విజయవాడలో అతడికి ఒక ఫోటో స్టూడియోకూడా ఉంది. అతడే ఈ కలర్ ఫోటోలను తీసి పెళ్ళికానుకగా రవి కృష్ణకు అందించాడు. పెళ్ళై నెల రోజులయినా ఆ ఫోటోలను చూస్తుంటే పెళ్ళినాటి ఒక్కో దృశ్యమూ కళ్ళెదుట ఇప్పుడు జరుగుతున్న అనుభూతి కలుగుతోంది.

"క్లింగ్. క్లింగ్...పోస్ట్!"

చూస్తున్న ఆల్బమ్‌ను పక్కన పెట్టి బయటికి వచ్చాడతను.

పోస్ట్‌మాన్ రెండు కవర్లు అందించాడు. ఇంట్లోకి వచ్చి అవి 'ఎవరు రాశారా' అని చూశాడు.

ఒకటి అతడి మామయ్య రాసినది. దాన్ని పక్కనుంచి రెండో కవర్ని చూశాడు. వెనక 'లక్ష్మి' అని ఉంది. వెంటనే దాన్ని చింపి చదవసాగాడు.

"ప్రియమైన రవికృష్ణగారికి,
నమస్సులు!

కులాసాయేనా? నేను కుశలమే.

నాపై కోపమేమీ రాలేదు కదా!

క్షమించండి, మీ పెళ్ళికి రావాలని చాలా ప్రయత్నించాను. కాని, అనివార్య కారణాల వల్ల రాలేకపోయాను. అందుకెంతో బాధ పడ్డాను. అన్యథా భావించరని ఆశిస్తాను.

ఇక దాదాపు సంవత్సరం క్రితం మన మధ్య జరిగిన ఆ నాటి సంభాషణ మీకు గుర్తుందే ఉంటుంది."

ఉత్తరం చదువుతున్న రవి కృష్ణ మదిలో ఆనాటి సంఘటన మెదిలింది.

×× ×× ××

రవికృష్ణ బి. ఇ. చివరి సంవత్సరం చదువుతున్న రోజులవి. ఒక రోజు తన స్టూడెంట్స్‌తో పాటు పిక్నిక్‌కు వెళ్ళాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక అందరూ ఓ చెట్టు కింద విశ్రమించారు. తరవాతి కార్యక్రమానికి ఇంకా అరగంట టైము ఉండడంతో బాతాఖానీ మొదలు పెట్టారు. వారి సంభాషణ చదువు దగ్గర మొదలై సినిమాల మీదగా రాజకీయాలపైకి జంప్ చేసి, అక్కణ్నుంచి వరకట్న సమస్య మీదకు వచ్చి పడింది.

"నా దృష్టిలో కట్నం తీసుకునే వాడొక దరిద్రుడు. వీధిలో అడుక్కుతినే ముష్టివాడికీ, కట్నమడిగి తీసుకునే వాడికీ తేడా లేదు. నా మట్టుకు నేను పెళ్ళి చేసుకోవడమైనా మానేస్తాను కాని, కట్నం తీసుకొని మాత్రం పెళ్ళి చేసుకోను." ఆవేశంగా చెప్పాడు వెంకట్.

"నేడు వరకట్న పిశాచి ఎందరి యువతుల ప్రాణాల్ని బలి తీసుకుంటుందో మనకు తెలియంది కాదు. ఈ దారుణాలను చూస్తూకూడా కట్న మడగడం మానవత్వమనిపించుకోదు. అందుకే నేను కట్నం తీసుకోను." కొద్దిగా నిదానంగా చెప్పినా, స్థిరంగా చెప్పాడు చక్రపాణి.

కట్నం తీసుకోమని ఇలాగే మరి కొంతమంది గట్టిగా చెప్పారు.

వారి మాటలను విమర్శిస్తూ నీరజ అందుకుంది.

"ఇలా కట్నం తీసుకోమని చెప్పడం చాలా తేలిక. గొప్ప అభ్యుదయ భావా లున్నట్టు పోజు పెట్టి చెప్పడానికైతే ఇలా ఎన్నయినా చెప్తారు. ఆచరణలో కొచ్చేసరికే శూన్యహస్తం చూపిస్తారు.

"మీకన్నా మంచి పదాల్ని ఉపయోగించి, మరెంతో చక్కగా కట్నం తీసుకోమని చెప్పిన వాళ్ళని బోల్డంత మందిని చూశాను. అలా చెప్పిన వాళ్ళందరూ కట్నం తీసుకున్నారు. అదేమని అడిగితే నిజానికి కట్నం తీసుకోవడం వారి కిష్టం లేదట. కాని, ఇంట్లో వారు పట్టుబట్టడంతో తప్పని సరి పరిస్థితుల్లో తీసుకున్నారట. చెప్పాలనుకుంటే సాకులకు కరువా? నవాలక్ష చెప్పొచ్చు."

ఆవేశంగా, గట్టిగా, ఏకధాటిగా మాట్లాడడం వల్ల వచ్చిన ఆయాసాన్ని తీర్చుకోవడానికి కాసేపాగింది ఆమె.

వెంటనే రవీంద్ర అందుకున్నాడు. అతనో చిన్న సైజు రచయిత.

"మీరు చెప్పింది కూడా నిజమే. అయితే, కట్నం తీసుకోమని చెప్పే వారందరూ ఇతరులను మభ్య పెట్టడానికే అలా చెబుతున్నారని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే కట్నం తీసుకోమని చెబుతున్న వారిలో మనస్ఫూర్తిగా చెబుతున్న వారుకూడా ఉంటారు. కాకపోతే అలాంటి వారికి తమ మాటను నిలబెట్టుకున్నే ప్రయత్నంలో సమాజంలో కొన్ని ఆటంకాలు ఏర్పడుతుంటాయి. వాటిని ఎదుర్కొనే మనో ధైర్యం లేక కొంతమంది తల్లితండ్రుల మాట ప్రకారం పెద్దల ముందు తమ పట్టు సడలిపోగా మరి కొంతమంది తామన్న మాటని నిలబెట్టుకోలేక పోతుంటారు."

నీరజ ఏదో చెప్పబోతున్న సమయంలో సంజీవ్ ఇలా అన్నాడు:

"కట్నం అంటే కానుక. కానుక అడిగి తీసుకునేది కాదు. ఇస్తే పుచ్చుకోవచ్చు. వద్దని అనకూడదు కూడా! కట్నం అడిగి ఇవ్వలేకపోతే హింసించడం నేరమే. కాని, వారు వారికి తోచింది ఇస్తే పుచ్చుకోవడంలో తప్పు లేదని నా అభిప్రాయం" అతని అభిప్రాయంతో లక్ష్మి ఏకీభవించలేదు.

"కట్నం అంటే అర్థం కానుకే. కాని, నేడు ఆ అర్థంతో కట్నాన్ని ఎవరూ చూట్టల్లేదు. ఇప్పుడు కట్నం అడగడం ఒక ఆచారమైంది. కట్నం ఇవ్వడం ఒక సంప్రదాయమైంది.

"ఏ వ్యక్తి అయినా, ఒక పని చేసేటప్పుడు తన చుట్టూ ఉన్న నలుగురితో పోల్చి చూసుకుంటాడు. తన చుట్టూ ఉన్న పది మందీ కట్నం తీసుకుంటే తానూ తీసుకోవాలన్న అభిప్రాయం సామాన్య వ్యక్తికి సహజంగా కలుగుతుంది. అదే బలపడితే కట్నం అడుగుతాడు. ఇస్తామన్న కట్నం ఇవ్వకపోతే, దాన్ని ఎలాగైనా రాబట్టాలని ప్రయత్నిస్తాడు. కట్నం తేలేదని ఒక స్త్రీని ఓ తల్లీ, కొడుకూ హింసిస్తే ఆ తప్పు కేవలం వారిద్దరిదీ కాదు; కట్నం తీసుకోవడం మాహక్కు- అన్న భావాన్ని వారి హృదయాల్లో ముద్రించిన సమాజానిది కూడా. అలాంటి సమాజంలో మనమూ ఒకరం ఎందుకవ్వాలి?"

కాసేపు ఆగి మళ్ళీ చెప్పసాగింది ఆమె.

"రేపు మీరు ఇంజనీర్లవుతారు. కట్నం ఇవ్వమని మీరు అడగక్కరలేదు. ఇంజనీర్లనగానే కూతురు పుట్టినప్పటినుండి కూడబెట్టిన లక్షల డబ్బుతో మీ ఇంటి ముందు క్యూలో నిలబడే తండ్రులు చాలామంది ఉన్నా రీ సమాజంలో. ఇలా వారు కట్నం ఇవ్వడంలోనూ, మీరు తీసుకోవడంలోనూ మీ ఇద్దరికీ ఏ బాధా ఉండకపోవచ్చు. ఇదో ఆచారంగా ఇంకా బాగా స్థిరపడుతుంది. ఫలితంగా కట్నం ఇచ్చుకోలేని మధ్యతరగతి కుటుంబాలు వీధిన పడతాయి. అందుకే ఈ దురాచారం తొలగి పోవాలంటే ఎవరూ కట్నం తీసుకోకూడదు. అయినా, ఒక్కటి ఆలోచించండి. కట్నం డబ్బు ఎంతైతే మాత్రం అది మీ కష్టార్జిత మిచ్చినంత ఆనందాన్ని ఇస్తుందా?"

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. కొద్ది క్షణాలు మౌనం వారి మధ్య గంభీరంగా రాజ్యమేలింది. తరవాత మెల్లిగా, "సరియస్‌గా అన్నాడు కేశవరావు.

# నిజం

## లంక ఫణీందర్

"మీరు చెప్పింది అక్షరాలా నిజం. నేను కట్నం అడగను. ఇచ్చినా తీసుకోను. ఈ మాటలు మనస్ఫూర్తిగా చెబుతున్నాను."

"నిజంగా!" అనుమానంగా అడిగింది నీరజ.

"నిజంగా." స్థిరంగా చెప్పాడతను.

"నువ్వు కట్నం తీసుకోవడ మేమిట్రా?" ఎప్పుడూ కేశవరావునే అంటి పెట్టుకు తిరిగే సంతోష్ అడిగాడు ఆశ్చర్యంగా.

"అదేరా, కట్నం తీసుకోనంటున్నా" కొద్దిగా ఇబ్బందిగా ముఖం పెట్టి అన్నాడు కేశవరావు.

"అంటే..."

"అంటే...ఇందులో అర్థం కాకపోవడానికేముంది. ఏమీ లేదు."అంటూ లేచి అక్కడినుండి కదిలాడతను.

అతడి ప్రవర్తన అక్కడి వారందరికీ ఆశ్చర్యాన్ని, కుతూహలాన్నీ కలిగించింది. అందరి కళ్ళూ కారణ మేమిటని తననే ప్రశ్నిస్తూండడం గమనించి చెప్పాడు సంతోష్.

"వాడికి మేనరికం ఉంది. కట్నం క్రింద వాడి చదువు కయ్యే ఖర్చంతా వాళ్ళ మేనమామే భరిస్తున్నాడు. అలాగని వాడి తల్లితండ్రులకూ, మామయ్యకూ ఒప్పందం కుదిరింది కూడా. అలాంటి వీడు ఇప్పుడు కట్నం తీసుకోనని చెబుతూంటే ఆశ్చర్యం వేస్తోంది."

సంతోష్ మాటలు విన్న వారికికూడా ఆశ్చర్యం వేసింది. అంతవరకూ వారి మాటలు వింటూ మౌనంగా కూర్చుని ఉన్న రవికృష్ణ పెదవులపై ఓ



చిరునవ్వు అరక్షణం కదిలి మాయమైంది. అది గమనించిన లక్ష్మి అడిగిం దతణ్ణి కొద్దిగా నవ్వుతూ.

"అవునూ, ఇంతకీ మీ అభిప్రాయం చెప్పనే లేదు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?"

రవికృష్ణ సహజంగా మితభాషి. తన మిత్రులతో మాత్రమే మనసు విప్పి మాట్లాడతాడు. లక్ష్మితో ఇంతకు ముందు రెండు మూడు సార్లే మాట్లాడినా తన స్పష్టమైన అభిప్రాయాన్నే తెలియజేశాడు.

"ఎవరూ కట్నం తీసుకోకూడదనే మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఈ వరకట్న దురాచార నిర్మూలనకు రెండు పద్ధతులున్నాయి. మొదటిది, ప్రతి పురుషుడూ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవడం. ఇక రెండవది, ప్రతీ యువతీ కట్నం కోరని పురుషుణ్ణే వివాహమాడడం. ఈ రెండు పద్ధతుల్లో దేన్ని పాటించినా ఈ సమస్య సమసిపోతుంది. అయితే, నేటి సమాజంలో పెళ్ళి విషయంలో స్త్రీకన్నా పురుషుడుకే ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్నాయని మన కందరికీ తెలుసు. అందుకే సమస్యా నిర్మూలనకు మొదటి పద్ధతి రెండవ దానికన్నా చాలా సులభమైన దని నా అభిప్రాయం.

"ఇక నేను కట్నం తీసుకోను అని మీతో ఇప్పుడు చెప్పను. అలా అని చెప్పి మిమ్మల్ని ఇప్పుడు నమ్మించలేను. ఆ ప్రయత్నంలో నేను ఏం మాట్లాడినా. వరకట్నం ముఖ్యాంశంగా తీసిన తెలుగు సినిమాలోని హీరో డైలాగుల్లా అనిపిస్తాయే తప్ప నా మాటల్లా అనిపించవు. అందుకే నా పెళ్ళికి మిమ్మల్నందరినీ ఆహ్వానిస్తాను; వచ్చి నిజా నిజాలేమిటో అక్కడే తెలుసుకోండి."

ఆ తరవాత ఆ సంభాషణ మరి కొంత సేపు సాగి ముగిసింది.

×× ×× ××

ఆ సంఘటనను ఒకసారి గుర్తు చేసుకొని అతను మళ్ళీ ఉత్తరం చదవసాగాడు.

"...ఆ రోజు కట్నం తీసుకోనని అన్నారు. అన్న మాటను అక్షరాలా నిలబెట్టుకున్నారు. అందుకు నా హృదయపూర్వక అభినందనలు స్వీకరించండి.

పెళ్ళిలో వియ్యాలవారు మీ గురించి ప్రత్యేకంగా చెప్పుకున్నారట; నీరజ చెప్పింది. ఈ విషయంపై పెళ్ళయిన తరవాత మిమ్మల్ని అభినందిస్తూంటే మీ రన్నారట...

'మీరు నన్నింతగా అభినందించాల్సిన ఘనకార్యాన్ని దేన్నీ నేను సాధించలేదు. ఈ రోజుల్లో చాలామంది యువకులు చేస్తున్న ఒక తప్పు పనిని నేను చేయలేదంతే' అని. ఈ మాటలు చాలు మీ ఆదర్శాన్ని తెలుపడానికి.

కానుకల రూపంలో కట్నాలను వసూలు చేసి, 'నేను కట్నం తీసుకోలేదు' అని ఊరంతా చాటింపు వేసుకునే పురుష పుంగవులున్న ఈ సంఘంలో మీ లాంటి విశాల హృదయులుండటం నా కెంతో సంతోషాన్నిస్తోంది. ములగ చెట్టు ఎక్కించేస్తున్నానని అనుకోవటం లేదు కదా!

ఇక ఉంటాను
ఇట్లు
లక్ష్మి."

చిన్నగా నవ్వుకొని అతడు రెండవ కవరును విప్పాడు. అందులో ఇలా ఉంది:

"చిరంజీవి. రవికృష్ణకు

ఆశీస్సులతో మీ మామ వ్రాయు ఉత్తరం. ఇక్కడ అంతా క్షేమం. అక్కడ మీ రిరువురూ క్షేమమని భావిస్తున్నాను.

అమ్మాయితో నువ్వు వ్రాయించిన ఉత్తరం ఈ రోజే అందింది.." చదువుతూన్న రవికృష్ణ ఒక్క క్షణం ఆగి మళ్ళీ చదవసాగాడు.

"నువ్వు ఇప్పుడు కట్నం కావాలని అడిగినట్టు అమ్మాయి వ్రాసింది. 'నాకు కట్నం వద్దు' అని పెళ్ళికి ముందే చెప్పిన నువ్వు ఇప్పుడు కట్నం కావాలని అడగటం ఆశ్చర్యంగా ఉంది. నిజానికి కట్నం ఇవ్వం అని మేము ఎవరమూ అనలేదు. పెద్దమ్మాయి లిద్దరికీ కట్న మిచ్చే పెళ్ళిళ్ళు చేశాను. నువ్వడిగిన మూడు లక్షలూ నా కో పెద్ద సమస్య కాదు. పెళ్ళికి ముందే ఈ విషయాన్ని ఒక్కసారి చెప్పి ఉంటే పెళ్ళినాడే నీకు ఆ మొత్తాన్ని ఇచ్చి ఉండేవాణ్ణి. సరే! జరిగిందేదో జరిగిపోయింది. నెల రోజుల్లో దసరా వస్తూంది. పండక్కి అమ్మాయీ, నువ్వూ రాండి. అప్పటికి నువ్వడిగిన డబ్బు సిద్ధం చేసి ఉంచుతాను.

ఆశీస్సులతో మీ
మామయ్య
రాఘవరావు."

ఉత్తరం చదివిన రవికృష్ణకు ఓ క్షణం ఏమీ అర్థం కాలేదు. మరు క్షణంలోనే ఏదో స్ఫురించింది. ఓ చల్లని గాలి అలా హఠాత్తుగా ముఖాన్ని తాకినట్టయిం దతడికి. అంతలోనే మరేదో సందిగ్ధం.

"శిరీ!" మామూలుగా పిలవాలని అతను చేసిన ప్రయత్నం కేక రూపంలో బయటికి వచ్చింది. అతనికి తెలియకుండానే ఆ కేకలో తీవ్రతకూడా ధ్వనించింది.

భర్త కంఠం వినపడగానే గ్యాస్ స్టవ్ కంట్రోలర్‌ని హై నుండి సిమ్‌లోకి తగ్గించి, జారిపోబోతున్న చీర కొంగును సరి చేసుకుంటూ గబగబా హాల్లోకి నడిచిం దామె. ఆమె ముఖంలో ప్రశ్నార్థకంకన్నా ఆమె నడకలో ఒయ్యారమే కాస్త ఎక్కువగా వ్యక్తమవుతూంది. ఆ ఒయ్యారంతో నేను పోటీకి రాలేనా అన్నట్టుగా అటూ ఇటూ ఊగుతూంది. ఆమె నడుమును దాటిన నల్లని జడ.

తన వైపే సూటిగా చూస్తూ నిలబడ్డ భర్తనూ, అతడి చేతిలోని ఉత్తరాన్నీ చూడగానే ఆమె ముఖంలోని ప్రశ్నార్థకం ఆశ్చర్యార్థకంగా మారింది.

ఆమె ఏమిటి అని ప్రశ్నించకముందే విసురుగా ఉత్తరాన్ని ఆమెకు అందించాడు. ఆమె ఉత్తరాన్ని అందుకొని చదువుతూంటే ఆమె ముఖాన్నే చూడసాగాడు.

ఆమె ఉత్తరం చదవగానే సూటిగా ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"నేను కట్నం కావాలని అడిగినట్టు మీ నాన్నకు ఉత్తరం రాశావా?" 'లేదు' అనే జవాబు ఆమె నుండి రావాలని అతడి ఆకాంక్ష. చాలా ఆతురతగా ఆమె ముఖంలోకి చూస్తున్నా డతను.

"అవును. రాశాను."

ఇక్కడ అతడికి బదులు మరో మగాడు ఉండి ఉంటే ఆమె చెంప చెళ్ళు మనుండేది.

కాని, ఆమె జవాబు విని అతడు చెంప దెబ్బ తిన్న వాడిలా అదిరిపడ్డాడు. అతడు ముఖం నల్లబడింది.

విస్మయంతో అడిగాడు.

"ఎందుకు? ఎందుకు వ్రాశావలా?"

"ఎందుకేమిటండీ? మన కోసమే!"

"మన కోసమా? అసలు కట్నం తీసుకోవడం నా కిష్టముండదనీ, అలా తీసుకునే వాళ్ళంటే నా కసహ్యమనీ నీకు తెలియదా? అతనలా ప్రశ్నిస్తుంటే అతని గొంతు అతనికే వింతగా తోచింది.

"అదే కట్నం తీసుకోవడం మీ కెందుకని ఇష్టముండదు? తేరగా కట్నం వస్తూంటే తీసుకోవడానికేమైంది మీకు? ఎవరినో ఉద్ధరించడానికి మీరు కట్నం తీసుకోకుండా ఉంటారా?

నేను కట్నం తీసుకోలేదు.' అని పది మందిలో చెప్పుకోవాలని ఉంటే అలాగే చెప్పుకోండి. అందుకు నిజంగా కట్నం తీసుకోకుండా ఉండాలా?"

ఆమె మాటలు వింటూంటే అతనికి మతిపోయింది. అతనిలోని శక్తినంతా ఎవరో లాగేస్తున్న భావన కలుగుతోంది. "అసలు నా కక్కర్లేని కట్నం మీద నీ కెందు కింత మోజు?"

అప్రయత్నంగా అడిగాడు.

"భలేవారే! కట్నం మీరు కోరితే ఒకటీ, నేను కోరితే ఇంకొకటీనా?! ఎవరు తీసుకున్నా మనకేగా?

"అయినా, మాట వరసకి మీరు కట్నం వద్దు అన్నారే అనుకోండి, అదే పది వేలనుకొని మా నాన్నగారు సరే అనడమేనా? అక్క లిద్దరికీ తలా మూడేసి లక్షల కట్న మిచ్చి, నన్ను ఊరికే పంపేయడమేనా? కన్నతండ్రిగా ఆయన కిదేమైనా బాగుందా? అప్పో, సొప్పో చేసి నా ముచ్చటా తీర్చొద్దా? ఏం నేను మాత్రం ఆయనకి కూతుర్ని కాదా?"

వింటూన్న రవికృష్ణ బుర్ర గిర్రున తిరగసాగింది. నవనాడులూ కుంగిపోతూన్నట్టనిపించి, పక్కనే ఉన్న

పడక కుర్చీలో కూర్చున్నాడు. ఆమె నుండి ఇలాటి జవాబు వస్తుందని అతడూహించలేదు. స్త్రీలో ఇంతటి ఈర్ష్య, స్వార్థం ఉంటాయన్నది అతని ఊహ కందని విషయం! ఈ చేదు నిజాన్ని అతను జీర్ణించుకోలేకపోతున్నాడు.

"స్త్రీవై ఉండి, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండి కూడా, నీ విలా ప్రవర్తించడం విడ్డూరంగా ఉంది. అయినా, నన్ను అడగకుండా, నేను రాయమన్నట్టు ఎందుకు రాశావు?" దాదాపు అరవాలని ప్రయత్నించాడు గాని ఒంట్లో ఆవరించిన నిస్సత్తువ అతడి ప్రయత్నాన్ని సఫలం చేయలేదు. నూతిలో నుండి వచ్చినట్టు కీచుమంటూ వచ్చిన ఆ ధ్వని అతడికే ఎబ్బెట్టుగా అనిపించింది.

"అవునండీ. స్త్రీని కాబట్టే, ఇంటిని చక్కబెట్టాల్సిన బాధ్యత నామీద ఉండబట్టే ఇలా చేశాను. అయినా, మీరు దీనికింత రాద్ధాంతం ఎందుకు చేస్తున్నారో నా కర్థం కావటం లేదు. డబ్బెవరికి చేదండీ? తేరగా మూడు లక్షలు వస్తూంటే వద్దంటారేమిటి? మూడు లక్షలంటే మాటలా? మంచి ఇల్లు కట్టుకోవచ్చు, చక్కటి ఫర్నిచరు, వీడియో...లాంటి ఎన్నో వస్తువులు కొనుక్కోవచ్చు.. ఇంకా."

అతనామె మాటలను వినడం లేదు. తలమీద చేయి వేసుకొని...

"ఈ సమాజంలోని ప్రతి పురుషుడూ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నంత మాత్రాన ఈ వరకట్న దురాచారం సమసిపోదు" అని తనలో తానే గొణుక్కుంటున్నాడు.

★

